క్లుప్తంగా

అంకితభావంతో పని చేసే వారికి గౌరవం



ఉద్యోగ విరమణ చేసిన భట్లు దంపతులను సత్కరిస్తున్న జడ్జి ప్రేమలత, కోర్టు సిబ్బంది

చీపురుపల్లి: అంకితభావం, క్రమశిక్షణతో విధులు నిర్వర్తించే వారికి ఎల్లప్పుడూ గౌరవం లభిస్తుందని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి వై.ప్రేమలత అన్నారు. స్థానిక కోర్టులో ఫీల్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన ఎం.బి.వి.భట్లును కోర్టు ప్రాంగణంలో శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ అంకితభావం, క్రమశిక్షణకు భట్లు నిదర్శనమని, ఆయన్ని తోటి ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. పార్వతీపురం అడిషినల్ సెషన్ జడ్జి ఎస్.దామోదరరావు, న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారుల మస్తర్లను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గిరిబాల

బొండపల్లి: గరుడుబిల్లి గ్రామంలో ఉపాధి వేతనదారులు చేపడుతున్న చెరువుకు సంబంధించిన కాలువ పనులను ఎంపీడీఓ జి.గిరిబాల శనివారం పరిశీలించా రు. వేతనదారుల మస్తర్ల సీటును తనిఖీ చేసి, ఫీల్డ్ అసిస్టెంట్‌కి పలు సూచనలు చేశారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి పనులు కల్పించడంతో పాటు, జాబ్ కార్డులు లేని వారికి జాబ్ కార్డులు ఇవ్వాలని చెప్పారు. ఆమె వెంట ఏపీఓ బి.కృష్ణవేణి, ఏఓ కె.తులసీరాం ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

వేపాడ: స్థానిక రైతు సేవా(రైతు భరోసా) కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ధాన్యం విక్రయించిన 48 గంటల్లోగా రైతు ఖాతాల్లో డబ్బులు జమయ్యేలాచూడాలన్నారు. ఎంపీడీఓ సూర్యనారాయణ, ఏఓ యశ్వంతరావు, పలువురు టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ఎల్.కోట మండలంలో..

లక్కవరపుకోట: మండలంలోని జమ్మాదేవిపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి శనివారం ప్రారంభించారు.కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ ఎల్.విజయ, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తీరు మార్చుకోకపోతే చర్యలు



పెదవేమలి అంగన్‌వాడీ కేంద్రం-2లో రికార్డులు పరిశీలిస్తున్న ఐసీడీఎస్ పీఓ ఉమాభారతి

గంట్యాడ: పెదవేమలి గ్రామంలోని అయిదు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ పీఓ డి.ఉమాభారతి శనివారం తనిఖీలు నిర్వహించారు. కేంద్రాల్లో రికార్డులను, పోషకాహార స్టాక్‌ను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం -3 లో రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంతో కార్యకర్తపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డుల నిర్వాహణ సక్రమంగా చేపట్టకపోతే ఏలా అని ప్రశ్నించారు. అంగన్‌వాడీ సెంటర్ -2, 4లలో పిల్లలు హాజరు కాకపోవడంపై సిబ్బందిపై మండిపడ్డారు. అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని, బాధ్యత రాహిత్యంగా పనిచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఆమె వెంట సూపర్ వైజర్ శ్రీలక్ష్మి ఉన్నారు.

వీఏఏలుగా నియమించాలి



ఎమ్మెల్యే లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీఈఓలు

లక్కవరపుకోట: తమని గ్రామ సచివాలయాల్లో వీఏఏ(విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్)లుగా నియమించాలని ఎంపీఈఓ(మల్టీ పర్పస్ ఎక్స్ టెన్షన్ ఆఫీసర్)లు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారిని కోరారు. మండల కేంద్రంలో ఎమ్మెల్యేను ఆమె నివాసంలో పలువురు ఎంపీఈఓలు శని వారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యవసాయ శాఖలో 2015 నుంచి తాము సేవలందిస్తున్నామని, జిల్లాలో 30 మంది పని చేస్తున్నామని, సచివాలయాల్లో ఖాళీగా ఉన్న వీఏఏ పోస్టులను తమ తో భర్తీ చేసేలా చూడాలని కోరారు. అలాగే ప్రభు త్వం నుంచి రావాల్సిన బకాయిలు ఇప్పించాలని కోరారు.

నత్తనడకన ధాన్యం కొనుగోలు

- ఎస్.కోట నియోజకవర్గంలో పూర్తిస్థాయిలో ప్రారంభం కాని ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు
- ధాన్యం సేకరణ లక్ష్యం **56,208** మెట్రిక్ టన్నులు కాగా, సేకరించింది **711** మెట్రిక్ టన్నులే
- అవసరమైన గోనె సంచులు **10 లక్షలు**.. ఇప్పటికి వచ్చినవి లక్షా **500**
- నేటికీ కొత్తవలస మండలంలో ప్రారంభం కాని కేంద్రాలు
- దళారులకు విక్రయించుకుంటున్న రైతులు

ఎస్.కోట నియోజకవర్గంలో ఖరీఫ్ వరి సాగు విస్తీర్ణం వివరాలు హెక్టార్లలో

మండలం	సాధారణ సాగు విస్తీర్ణం	సాగు చేసిన విస్తీర్ణం
ఎస్.కోట	4,044	4,023
ఎల్.కోట	3,802	3,451
జామి	5,275	5,259
కొత్తవలస	928	920
వేపాడ	3,569	3,512



ఎల్.కోట మండలంలోని సీతారాంపురంలో దళారులకు ధాన్యం విక్రయించుకుంటున్న రైతులు



కొత్తవలసలో పొలాల్లో ఉన్న వరి కుప్పలు

కొత్తవలస: ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం విక్రయించుకునేందుకు అన్నదాతలకు తిప్పలు తప్పడం లేదు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు గత నెల 15వ తేదీకే ప్రారంభం కావాల్సి ఉన్నప్పటికీ ఎస్.కోట నియోజకవర్గంలో ఇంకా పూర్తి స్థాయిలో కేంద్రాలను ప్రారంభించలేదు. కేంద్రాలు ప్రారంభించిన చోట కూడా ధాన్యం కొనుగోలు ప్రక్రి య నత్తనడకన సాగుతోంది. నియోజకవర్గం పరిధిలో నా లుగు రోజుల క్రితం ఎస్.కోట,జామి మండలాల్లో, లక్కవరపుకోట,వేపాడ మండలాల్లో శనివారం కొన్ని కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే కోళ్ల లలికుమారి ప్రారంభించారు. కొత్తవలస మండలంలో మాత్రం ఇంకా ఒక్క కేంద్రం కూడా ప్రారంభం కాలేదు. తుఫాన్ నేపథ్యంలో ధాన్యం కల్లాల్లో ఉంచితే పాడైపోతాయనే భయంతో గత్యంతరం లేక పలువురు రైతులు దళారులకు విక్రయించుకుంటున్నారు. నియోజకవర్గంలో ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం 17,618 హెక్టార్లు లక్ష్యం కాగా 17,165 హెక్టార్లల్లో రైతులు సాగు చేశారు.15 రోజుల క్రితమే సుమారు 60 శాతానికి పైగా వరికోతలు పూర్తయ్యాయి. ప్రభుత్వం సాగు పెట్టుబడి సహాయం అందించకపోవడంతో అప్పులు చేసి మరీ పంట సాగు చేశా మని, రైతు సేవా కేంద్రాల(రైతు భరోసా కేంద్రాలు) ద్వారా ఎరువులు, పురుగు మందులను కూడా పూర్తిస్థాయిలో సరఫరా చేయలేకపోయిందని రైతులు ఆరోపిస్తున్నారు. ఎన్నో ప్రతి కూల పరిస్థితుల మధ్య పంటను సాగు చేశామని, ఇప్పుడు చేతికందిన పంటను విక్రయించుకునేందుకు కూడా ఇబ్బందులు తప్పడం లేదని రైతులు వాపోతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారం భం కాకపోవడంతో పంటను విక్రయించుకోలేక పోతున్నామని, పంట సాగుకు తెచ్చిన అప్పులకు వడ్డీ పెరిగిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారం భించే వరకు ధాన్యాన్ని నిల్వచేసే సదుపాయాలు లేక కొందరు రైతులు గత్యంతరం లేని పరిస్థితిలో దళారులను ఆశ్రయించి వారు చెప్పిన ధరకే అమ్ముకోవాల్సి వస్తోంది.

రైతు సేవా (రైతు భరోసా) కేంద్రాల వివరాలు

మండలం	రైతుసేవా కేంద్రాలు
ఎస్.కోట	18
ఎల్.కోట	23
వేపాడ	18
జామి	20
కొత్తవలస	18

లక్ష్యం చేరుకునేనా..?

గతేడాది ఎస్.కోట నియోజకవర్గంలోని అయిదు మండలాల్లో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా 31,392 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారు.ఈ ఏడాది 56,208 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించేలా అధికారులు లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అయితే నవంబర్ 30 నాటికి కేవలం 711 మెట్రిక్ టన్నులు మాత్రమే సేకరించారు. 40 కిలోల సామర్థ్యంగల గోనె సంచులు సుమారు 10లక్షలు అవసరమైతే ప్రస్తుతానికి లక్షా 500 మాత్రమే వచ్చాయని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పూర్తిస్థాయిలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడం, గోనె సంచులు సరిపడా లేకపోవడం చూస్తుంటే ఈ ఏడాది అధికారులు ధాన్యం సేకరణ లక్ష్యాన్ని చేరుకునేనా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

కొనుగోలు ప్రారంభించాం..

ఎస్.కోట నియోజకవర్గం పరిధిలో ఎస్.కోట, జామి మండలాల్లో ఇప్పటికే కొన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాం. సుమారు 711 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతుల నుంచి ఇప్పటి వరకు సేకరించారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన రెండు రోజుల్లో వారి బ్యాంక్ ఖాతాకు డబ్బులను జమచేస్తాం. రైతులకు అవసరమై న గోనె సంచులు అందుబాటులో ఉన్నాయి.

– ఎల్.విజయ, వ్యవసాయశాఖ కొత్తవలస సబ్‌డివిజన్ ఏడీ

ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకున్నా..



నేను 10 రోజుల క్రితమే వరి పంట నూర్పు చేశాను. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించక పోవడంతో గత్యంతరం లేక 108 బస్తాలను ప్రైవేట్ వ్యక్తికి విక్రయించా. 84 కిలోల బస్తాను రూ.1,654 అమ్ముకున్నాను. మాగ్రామంలో చాలా మంది రైతులు ఇప్పటికే దళారులకు పంట విక్రయించేశారు.ప్రభుత్వం సాగుకు పెట్టుబడి సాయం అందించకపోయినా, ధాన్యం కొనుగోలు అయినా సకాలంలో చేస్తే బాగుండేది. – తూర్పాటి సోమేశ్వరరావు, సీతారాంపురం గ్రామం,ఎల్.కోట మండలం

ఎదురు చూస్తున్నాం..



సుమారు 15 రోజుల క్రితమే వరి కోతలు చేసేశాం. చేనును పొలంలో కుప్పలు పెట్టాం. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తే నూర్పు చేద్దామని ఎదురు చూస్తున్నాం. నేటికీ కొనుగోలు కేంద్రం ప్రారంభం కాలేదు. పంటసాగు పెట్టుబడికి తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగుపోతున్నాయి. ఎవరికి చెప్పుకోవాలో తెలియడం లేదు.ఇప్పటికైనా కొనుగోలు కేంద్రం ప్రారంభించాలి. – ఎస్.రాంబాబు, తలారి గ్రామం, ఎల్.కోట మండలం



ఎల్.కోట మండలంలోని రెల్లిగౌరమ్మపేటలో వరి నూర్పు చేస్తున్న రైతులు

మనో ధైర్యంతో వైకల్యాన్ని జయించాలి

- సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ



దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు తొడుగుతున్న సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి ఎన్.వి.రమణ



కృత్రిమ అవయవాలు తయారీ విధానాన్ని జస్టిస్ ఎన్.వి.రమణకు వివరిస్తున్న జగదీష్‌బాబు

కొత్తవలస: సమస్యలు లేని వారు ఎవరూ ఉండరని, అన్ని అవయవాలు బాగున్నప్పటికీ అనేక సమస్యలతో బాధపడుతున్న వారు సమాజంలో చాలా మంది ఉన్నారని, దివ్యాంగులు తమ వైకల్యాన్ని చూసి కుమిలిపోకుండా మనోధైర్యంతో వైకల్యాన్ని జయించి ముందుకు సాగాలని సుప్రీం కోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్. వి.రమణ అన్నారు. మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో ఉన్న గురుదేవ చారిటబుల్ ట్రస్టు 27వ వార్షికోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్.వి.రమణ దంపతులు ట్రస్టును సందర్శించారు. ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సూపర్ స్పెషాల్టీ ఆస్పత్రి, కృత్రిమ అవయవాల తయారీ యూనిట్‌ను పరిశీలిం చారు.అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో దివ్యాంగులు,ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ట్రస్టు చైర్మన్ జగదీష్‌కుమార్ దివ్యాంగులకు నిస్వార్థంగా సేవలందించడం అభినందనీయమన్నారు. ఇప్పటి వరకు ట్రస్టు ద్వారా సుమారు 2.45 లక్షల మందికి కృత్రిమ అవయవాలు అందజేసిన జగదీష్‌కుమార్ సేవలను గుర్తించి భారతప్రభుత్వం ఆయనకి అత్యున్నతమై అవార్డు ఇవ్వాలని సూచించారు.ట్రస్టుకు తమ వంతు సహాయం అందిస్తానని తెలిపారు.అనంతరం వంద మందికి కృత్రిమ అవయవాలు, వంద మంది అంధులకు ట్రస్టు ద్వారా పింఛన్ అందజేశారు. స్థానిక జూనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.విజయచంద్ర, డెక్కన్ ఫెర్రోఎల్లాయస్ కర్మాగారం ఎండీ రాజు, తహసీల్దార్ నీలకంఠరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నిర్మూలనకు కృషి



మాట్లాడుతున్న ఎయిడ్స్ కౌన్సిలర్ శ్రీనివాసరావు

చీపురుపల్లి: ప్రాణాంతకమైన ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎయిడ్స్ కౌన్సిలర్ శ్రీనివాస్ చెప్పారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్–2 యూనిట్, చైతన్య భారతి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ హెచ్ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వ్యాధి బారిన పడి అధిక సంఖ్యలో మృతి చెందుతున్నారని, విద్యార్థులు గ్రామాల్లో ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వి.కృష్ణాజీ, వైస్ ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ డాక్టర్ విజయేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల నెత్తిన విద్యుత్ చార్జీల భారం



మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

కొత్తవలస: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే అయిదేళ్లలో ఎప్పుడూ విద్యుత్ చార్జీలను పెంచబోమని ఎన్నికల ముందు చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని, అధికారం చేపట్టి ఆరునెలలు గడవక ముందే విద్యుత్ చార్జీలను భారీగా పెంచి ప్రజల నెత్తిన గుది బండ మోపారని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దుయ్యబట్టారు. శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు అనేక హామీలు ఇచ్చారని, వాటిని నమ్మి ఓట్లు వేసిన ప్రజలను ఇప్పుడు మోసం చేయడం తగదని పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ అని ఎన్నికలకు ముందు ప్రచారం చేశారని, భవిష్యత్‌కు గ్యారెంటీ ఏమో కాని ప్రజలపై బాదుడు గ్యారెంటీ అన్న ట్లు పాలన సాగుతోందని ఎద్దేవా చేశారు. సూపర్ సిక్స్‌తో పాటు ఇచ్చిన ప్రతీ హామీకి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కట్టుబడి ఉండాలని కోరారు.

పింఛన్‌దారుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే లలితకుమారి

కొత్తవలస: రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. మండల పింఛన్‌దారుల సంఘం వార్షికోత్సవాన్ని స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలోని పింఛన్‌దారుల భవనంలో శనివారం నిర్వహించారు.జిల్లా పింఛన్‌దారుల సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమా నికి అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పింఛన్‌దారుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు.

మహా రుద్రాభిషేకం



ఎల్.కోట మండలం, లచ్చింపేట గ్రామంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శనివారం రాత్రి మహారుద్రాభిషేకం నిర్వహించారు. కాశీ నుంచి తీసుకొచ్చిన 108 శివ లింగాలకు అర్చకులు నేతేటి మధుకుమార్‌శర్మ 108 మంది దంపతులతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం దశవిధ హారతులు ఇచ్చారు. గ్రామస్తులతో పాటు చుట్టుపక్క గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. – లక్కవరపుకోట

ఆర్యసమాజం వార్షికోత్సవం



చీపురుపల్లి పట్టణంలోని కొత్తఅగ్రహారంలో ఆర్యసమాజం మందిర వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ చేశారు. అనంతరం ఆర్యసమాజంలో గాయత్రీ మహాయజ్ఞం చేశారు. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించి, 3 గంట ల నుంచి వైదిక భజనలు చేశారు.

– చీపురుపల్లి

రోడ్డు పనులకు మోక్షం



చిత్రంలో పనులు జరుగుతున్నది గజపతినగరం, దత్తిరాజేరు మండలాలకు వెళ్లే రోడ్డు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే గజపతినగరం జాతీయ రహదారి నుంచి పైడితల్లమ్మ కోవెల వరకు రెండు కిలోమీటర్ల మేర డబుల్ రోడ్డు నిర్మాణానికి భూముల సేకరణ పూర్తయింది. అలాగే, గజపతినగరం పైడితల్లమ్మ కోవెల నుంచి దత్తిరాజేరు మండలం పార్లి గ్రామం వరకు 17.7 కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మాణానికి రూ.45.16కోట్లు ఎన్‌డీబీ నిధులు మంజూరయ్యాయి. ఎన్నికలు రావడంతో నిలిచిపోయిన రోడ్ల పనులు ఇప్పుడు చురుగ్గా సాగుతుండడంతో ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. – గజపతినగరం

గ్రామాల్లో వైద్య శిబిరాలు

లక్కవరపుకోట: శ్రీరాంపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యాధికారి తేజారెడ్డి ఆధ్వర్యంలో శనివారం వైద్యశిబిరం నిర్వహించారు. 68 మందికి సుగర్, బీపీ, తదితర వైద్యపరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు చేయడంతోపాటు ఎత్తుకు తగ్గ బరువు ఉన్నారో లేదా అని పరిశీలించారు. వైద్యసిబ్బంది రాజు,గౌరి,మణి,హేమ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురంలో..

గజపతినగరం: శ్రీరంగరాజపురం గ్రామ సచివాలయంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. 54 మందికి మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ, సిబ్బంది వివిధ వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బొండపల్లి: తుఫాన్ నేపథ్యంలో వరి సాగు చేసిన రైతులు అప్రమత్తంగా ఉండాలని, వరి చేనుతో పాటు నూర్పు చేసి న ధాన్యం తడిసి పోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ జిల్లా జేడీ వి.టి.రామారావు సూచించారు. గరుడుబిల్లిలో వరి కుప్పలు, నూర్పులు చేసి మిల్లులకు తరలించడానికి సిద్ధం చేసిన ధాన్యం బస్తాలను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా రైతులతో ఆయన మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం మూడు రోజుల పాటు ఉండే అవకాశం ఉందని, రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని చెప్పారు. వరిలో రెల్ల రాల్చు పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని, వ్యవసాయ అధికారుల సూచన మేరకు నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఏఓ పి.వి.మల్లికార్జునరావు, వీఏఏ అప్పలనాయుడు ఉన్నారు.

ఉన్నత స్థానాలు అధిరోహించాలి..




ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్డీఓ, సీఐ, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

చీపురుపల్లి: విద్యార్థులు సత్ప్రవర్తనతో మెలిగి, కష్టపడి చదువుకుని ఉన్నత స్థానాలకు అధిరోహించాలని ఆర్డీఓ జీవీ సత్యవాణి ఆకాంక్షించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చీపురుపల్లి శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాలు, హెచ్ఐవీ నిర్మూలనపై మండల కేంద్రంలో శనివారం అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆర్డీఓ సత్యవాణి మాట్లాడుతూ.. భారతదేశ సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రపంచంలోనే ఎంతో గౌరవం ఉందన్నారు. అదే సనాతన ధర్మాన్ని ప్రతి విద్యార్థీ కొనసాగించాలన్నారు. విద్యార్థి దశలో చదువుపై మాత్రమే శ్రద్ధ ఉండాలి తప్ప.. అనవసర విషయాలపై ఉండకూడదన్నారు. ముఖ్యంగా మత్తు పదార్థాల జోలికి వెళ్లకూడదని సూచించారు. కష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలు, హెచ్ఐవీ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐ జి.శంకరరావు, డాక్టర్ కుమార్, రెడ్‌క్రాస్ కోఆర్డినేటర్ బీవీ గోవిందరాజులు, ఉపాధ్యాయుడు డోల నాగరాజు, మీసాల లక్ష్మణరావు, పనస రవి, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింటు అయిన స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శృంగవరపుకోట చీఫ్ మేనేజర్ గారు నాకు యిచ్చిన భోగట్టాపైని యీ క్రింది విధముగా పబ్లిక్ నోటీసు జారీ చేయడమైనది.

నా క్లయింటు బ్యాంకు శ్రీ దొడ్డ వెంకటరావు S/o అప్పారావు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్.కోట బ్రాంచి అనువారికి విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో కణపాక గ్రామము సు॥నెం.10/12, 10/15, 11/2లో ఫ్లాట్ నెం.104, శ్రీనివాస మైత్రివనములో గ్రౌండ్ ఫ్లోర్ నివాసముదాయం కొనుగోలు చేయుటకు ఋణము మంజూరు చేసియున్నారు. సదరు దొడ్డ వెంకటరావు గారు బోలిశెట్టి శ్రీనివాసు S/o అప్పారావు అనువారి వద్ద దస్తావేజు నెం.7313/2023 తేది.27.10.2023న సబ్‌రిజిస్ట్రారు విజయనగరం (పడమర) వారి ద్వారా క్రయం పొందియున్నారు. సదరు దస్తావేజు నెం. 7313/2023 జెరాక్స్ తీయుటకు బ్యాంకు సిబ్బంది వారు వెళ్ళినపుడు దస్తావేజు పోయినది. ఆ తర్వాత నా క్లయింట్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ శృంగవరపుకోట వారికి తేది.10.09.2024 పిర్యాదు చేసినారు పోలీసులు విచారణ జరిపిన తదుపరి వారు తే08.11.2024దీన సర్టిఫికేట్ జారీచేసియున్నారు. ఎంత ప్రయత్నించినప్పటికి కనుగొనలేకపోయారు. ఇప్పుడు నా క్లయింటు పైన పేర్కొన్న దాక్యుమెంటు యొక్క సర్టిఫికేట్ కాఫీని ఋణము నిమిత్తం డిపాజిట్ చేయవలసియున్నది. కావున పైన వివరించిన ఆస్తిపై ఏమైనా అభ్యంతరము, క్లెయిమ్ కలిగి ఉన్నట్లయితే యీ రోజు నుండి 15 రోజులలోగా నాకు గాని లేదా చీఫ్ మేనేజర్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, శృంగవరపుకోట వారికి తెలియజేయండి. బ్యాంక్ ఋణము నిమిత్తం పైన పేర్కొన్న బ్యాంకులో పైన పేర్కొన్న ఆస్థిని తనఖా పెట్టుటకు ప్రయత్నము చేయుచున్నారు.

Sd/- T.V.S SANYASI RAO, Advocate
Srungavarapukota, Vzm Dist., Cell. 9440255617